క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి కళాసీల విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేస్తున్న కళాసీలు

చీపురుపల్లి: పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థానిక సివిల్ సప్లయిర్స్ గొడౌన్‌లో పని చేస్తున్న అదే గ్రామానికి చెందిన కళాసీలు రూ.30,116 విరాళం ప్రకటించారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు కోట్ల లక్ష్మణరావు, లక్ష్మణకు కళాసీలు నగదును మంగళవారం అందజేశారు.

28న మండల సర్వసభ్య సమావేశం

దత్తిరాజేరు: మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు అధ్యక్షతన ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రకుమా రి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు హాజరు కావాలని కోరారు.

ఫీల్డ్‌అసిస్టెంట్‌కు మెమో జారీ

గజపతినగరం రూరల్: మండలంలోని కాలంరాజుపేట గ్రామానికి చెందిన ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ మిత్తిరెడ్డి ఆదిలక్ష్మికి ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ మంగళవారం మెమో జారీచేశారు. ఈనెల 20వ తేదీన గ్రామంలో ఉపాధి పనులు నిలిపి వేయ డంతో వేతనదారులు ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్‌పై ఫిర్యాదు చేశారు. దీంతో ఎంపీడీఓ విచారణ చేసి మెమో జారీ చేశారు. డిమాండ్ సిద్ధం చేయకపోవడం వల్ల పనికల్పించ లేక పోయినట్లు ఫీల్డ్ అసిస్టెంట్ వివరణ ఇచ్చారని ఎంపీడీఓ తెలిపారు.

దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వే



భూదేవిపేటలో సర్వే చేస్తున్న ఐఈఆర్టీ శ్రీనివాసరావు

గజపతినగరం: మండలంలో బడి ఈడుకు వచ్చిన దివ్యాంగ పిల్లల గుర్తింపు సర్వేను చేపడుతున్నామని స్థానిక భవత కేంద్రం ఐఈఆర్టీ శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని పాత బగ్గాం, గుడివాడ, మరుపల్లి, ఎం.గుమడాం, బంగారమ్మపేట, భూదేవిపేట తదితర గ్రామాల్లో మంగళవారం సర్వే నిర్వహించారు. 11మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని, ఈ సర్వే జూన్ 9వ తేదీ వరకు కొనసాగనుందని శ్రీనివాసరావు చెప్పారు.

పేపర్ క్రాఫ్ట్‌పై అవగాహన



పేపర్‌తో తయారు చేసిన కళాకృతులను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో కొత్తవలస లైబ్రేరియన్ రామలక్ష్మి

కొత్తవలస/లక్కవరపుకోట: శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఆకట్టుకుంటున్నాయి. కొత్తవలస,లక్కవరపుకోట మండల కేంద్రాల్లోని శాఖా గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న తరగతులకు విద్యార్థులు, చిన్నారులు ఉత్సాహంగా హాజరవుతున్నారు. మంగళవారం ఆయా గ్రంథాలయాల్లో చిన్నారులు, విద్యార్థులకు అల్లికలు,పేపర్ క్రాఫ్ట్‌పై లైబ్రేరియన్‌లు మీసాల రామలక్ష్మి, మేరీ కుమారి అవగాహన కల్పించారు. చిన్నారులు పేపర్‌తో తయారు చేసిన ఫ్లవర్స్, ఇతర కళాకృతులు ఎంతగానో ఆకట్టుకున్నాయి. సుమారు 60 మంది విద్యార్థులు హాజరయ్యారు.

దోమల నివారణకు చర్యలు



పి.కెఆర్.పురంలో ఏసీఎం ద్రావణం పిచికారీ ప్రక్రియను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: దోమల నివారణ చర్యల్లో భాగంగా మండలంలోని పెదకృష్ణరాజపురం గ్రామంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, మలేరియా శాఖ సిబ్బంది పర్యవేక్షణలో మంగళవారం ఏసీఎం ద్రావణం పిచికారీ చేశారు. కార్యక్రమాన్ని మండల ప్రత్యేక అధికారి పి.ఎస్.వి. లక్ష్మీనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ ఏసీఎం ద్రావణంతో దోమలను నివారించవచ్చని అన్నారు. సిబ్బందికి సహకరించి ఇళ్లలో, నివాస పరిసరాల్లో ఏసీఎం ద్రావణం పిచికారీ చేయించుకోవాలని వివరించారు.బొద్దాం పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మూర్తి ఆశ వర్కర్లు, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల పండగ



దత్తిరాజేరు: చినకాదలో అమ్మవారి ఘటాల ఊరేగింపు



గజపతినగరం: పురిటిపెంట గ్రామంలో పైడితల్లమ్మ ఆలయ వద్ద నాగదేవతకు పూజలు చేస్తున్న భక్తులు



గుర్ల: కెల్ల గ్రామంలో అసిరితల్లి అమ్మవారి సిరిమానోత్సవం



గుర్ల : కెల్ల గ్రామంలో సిరిమానుకు పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు



గుర్ల: కెల్ల గ్రామంలో ట్యాంకుల ద్వారా తాగు నీటిని సరఫరా చేస్తున్న ధీర ఫౌండేషన్ సిబ్బంది



గజపతినగరం: పురిటిపెంట గ్రామంలో పైడితల్లమ్మ దర్శనానికి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

గుర్ల: మండలంలోని కెల్ల గ్రామంలో అసిరితల్లి అమ్మవారి పండగ సందర్భంగా గ్రామస్తులు మంగళవారం సిరిమానోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పసుపు, కుంకుమ, చీరలు అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం సిరిమాను సంబరం వైభవంగా సాగింది. అమ్మవారి సిరిమానుకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ధీర ఫౌండేషన్ అధినేత బొత్స సందీప్ పూజలు చేశారు. సిరిమానోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై తిలకించారు. గ్రామంలో ధీర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్యాంకులు ద్వారా తాగునీరు సరఫరా చేశారు.

పురిటిపెంటలో..

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట గ్రామంలో పైడితల్లమ్మ వారి పండగను గ్రామస్తులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మ వారి ఆలయానికి ఉదయాన్నే చేరుకుని పూజలు చేశారు. చీరలు చూపించి మొక్కులు చెల్లించుకున్నారు.

చినకాదలో...

దత్తిరాజేరు: మండలంలోని చినకాదలో గ్రామదేవత నల్లమారమ్మ తల్లి పండగను గ్రామస్తులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు డప్పు వాయిద్యాల మధ్య ఘటాలతో ఊరేగింపుగా అమ్మవారి గుడికి చేరుకుని పూజలు చేశారు. రాత్రి రథోత్సవం నిర్వహించారు. సమీప గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

పుస్తక పఠనంతో మనోవికాసం



బాలభవన్ కేంద్రంలో చిన్నారులతో పుస్తక పఠనం చేయిస్తున్న రమణ

చీపురుపల్లి: పుస్తక పఠనం మనో వికాసానికి, జ్ఞాన సముపార్జనకు దోహదపడుతుందని, పాఠశాల స్థాయి నుంచే ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని ఆశయ రూరల్ లైబ్రరీ, ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ సూచించారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలభవన్ కేంద్రంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనంపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ఉద్యమ స్థాయిలో పుస్తక పఠనంపై విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు టీవీలు, మొబైల్ ఫోన్‌లతో కాలయాపన చేయకుండా పుస్తక పఠనం చేయాలని సూచించారు. పుస్తక పఠనం మెదడుకు మంచి వ్యాయామమని, నిరంతరం పుస్తకాలు చదివే వారికి అల్జీమర్స్ వంటి వ్యాధులు రావని చెప్పారు.

సంస్కృతి,సంప్రదాయాలపై అవగాహన



గ్రంథాలయంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న మోహనరావు

చీపురుపల్లి: విద్యార్థులు చిన్న వయస్సు నుంచే సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కలిగి ఉండాలని జనజాగృతి వేదిక అధ్యక్షుడు వి.మోహనరావు అన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి శిక్షణా శిబిరంలో విద్యార్థులకు మంగళవారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు భారతదేశం పుట్టినిల్లు అని, ప్రపంచానికే భారతదేశం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. అలాంటి దేశంలో జన్మించినందుకు ప్రతి ఒక్కరూ గర్వంగా భావించాలన్నారు. పూర్వీకులు మనకు అందించిన సంస్కృతి, సంప్రదా యాలను కొనసాగించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం సామాజిక గేయాలను ఆలపించారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి ఎస్.బుచ్చింనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో వైద్యశిబిరం



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం గ్రామంలో లోతేటి లక్ష్మి జ్ఞాపకార్థం ఆమె భర్త, కుమారులు మంగళవారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. శిబిరానికి హాజరైన గ్రామస్తులకు వైద్య సిబ్బంది వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితం గా మందులు అందజేశారు. అంతకు ముందు లోతేటి లక్ష్మి విగ్రహాన్ని ఆవిష్కరించారు. లోతేటి లక్ష్మి కుటుంబ సభ్యులు, పాస్టర్ ప్రసన్నకుమార్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

ఆర్బీకేలకు చేరుకున్న వరి విత్తనాలు



కొర్లాం ఆర్బీకే వద్ద వరి విత్తనాల బస్తాలను అన్‌లోడ్ చేస్తున్న కళాసీలు

గంట్యాడ: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండల రైతులకు పంపిణీ చేసేందుకు ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు 2,200 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే)కు చేరవేస్తున్నామని ఏఓ బ్యూసె శ్యామ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రేగుబిల్లి, కొర్లాం, పెంట శ్రీరాంపురం ఆర్బీకేలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరో 400 క్వింటాళ్ల సాంబమసూరి, స్వర్ణ, సోనామసూరి రకాల విత్తనాలను వారం రోజుల్లో ఆర్బీకేలకు చేరవేయనున్నట్లు తెలిపారు. అలాగే పచ్చిరొట్ట విత్తనాలు కట్టె జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలు 50 శాతం రాయితీపై అందించనున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయుల ఇంటింట ప్రచారం



సీతంపేటలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

శృంగవరపుకోట: మా పాఠశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు ఉన్నాయి, మీ పిల్లల భవిష్యత్‌కు మేము గ్యారెంటీ, మా స్కూల్‌లో చేర్పించండి అంటూ ఉపాధ్యాయులు ఇంటింట ప్రచారం చేస్తున్నారు. మండలంలోని ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల/ బాలికల జూనియర్ కళాశాలలో చేరాలని కోరుతూ ధర్మవరం స్కూల్ ఉపాధ్యాయులు గ్రామాల్లో ప్రచారం చేస్తున్నారు. సీతంపేట , పోతనాపల్లి గ్రామాల్లో టెన్త్ పూర్తి చేసిన విద్యార్థినుల ఇళ్లకు వెళ్లి పాఠశాలలో ఉన్న వసతులు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను తల్లిదండ్రులకు వివరించారు. ప్రచారంలో ఎంఈఓలు బి.నర్సింగరావు, పి.జి.లక్ష్మి, హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు రహీంషేక్‌లాల్, సతీష్, ఎస్.వి.ఎస్. ఎన్.మూర్తి, కృష్ణంరాజు, సీహెచ్.సూరిబాబు, ఎం.ఆర్.టి లీలాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీఓ అప్పలనాయుడు

దత్తిరాజేరు: బలభద్రరాజపురం గ్రా మంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఆ పథకం ఏపీఓ అప్పలనాయుడు మంగళవారం పరిశీలించారు. వేతనదారులతో ఆయన మాట్లాడుతూ కొలతల ప్రకారం రెండు పూటలా పనులు చేస్తే ప్రభుత్వం నిర్దేశించిన గరిష్ట వేతనం అందుతుందని చెప్పారు. జాబ్ కార్డు ఉన్న వా రే పనులకు హాజరు కావాలని, ఒకరికి బదులు వేరొకరు హాజరు కాకూడదన్నారు. పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు అందుబాటులో ఉంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌ను ఆదేశించారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



ధర్మవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న డీఎస్పీ గోవిందరావు

శృంగవరపుకోట: గ్రామాల్లో శాంతిభద్రతలు మీ చేతుల్లోనే ఉన్నాయని, శాంతి భద్రతల పరిరక్షణలో మీరంతా పోలీసులకు సహకరించాలని డీఎస్పీ గోవిందరావు ప్రజలను కోరారు. మండలంలోని ధర్మవరం గ్రామస్తులతో మంగళవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని సూచించారు. గ్రామాల్లో రాజకీయ విభేదాలు, వర్గ వైషమ్యాలు, తగాదాలు, కుమ్ములాటలకు దూరంగా ఉండాలన్నారు. బెట్టింగ్‌లకు పాల్పడవద్దని బెట్టింగ్‌లు వల్ల ఆర్థికంగా నష్టపోవడం, రాజకీయ విభేదాలు, వైషమ్యాలకు కారణం అవుతాయన్నారు. అంతరాలు పెరిగి కొట్లాటకు దారి తీస్తాయని వివరించారు. ఏ చిన్న తగాదాకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని, వాటివల్ల భవిష్యత్‌లో ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ఎన్నికలు అయిపోయినందున గ్రామంలో అంతా సామరస్య జీవనం సాగించాలని కోరారు. కార్యక్రమంలో సీ ఐ మురళీరావు, ఎస్ ఐ గంగరాజు ఉన్నారు.

చెరువు గట్టుపై రోడ్డుపనులు నిలిపివేత



చెరువు గట్టుపై నుంచి వేస్తున్న మట్టి రోడ్డు

వేపాడ: మండలంలో వావిలపాడు పంచాయతీలో కుబిరెడ్డి వాని చెరువు గట్టుపై నుంచి స్టోన్ క్రషర్‌లకు చేపడుతున్న రో డ్డు నిర్మాణ పనులను రెవెన్యూ అధికారులు మంగళవారం అడ్డుకున్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు వీఆర్‌ఓ బాల భాస్కరరావు, సచివాలయ సర్వేయర్లు నవీన్, సాయి మంగళవారం రోడ్డు పనులను పరిశీలించారు. సాంకేతిక లోపం వల్ల చెరువు భూమిని సర్వే చేయలేదని బుధవారం సర్వే చేసి హద్దులు నిర్ధారించి, అక్రమణలు ఉంటే తొలగిస్తామని వీఆర్‌ఓ తెలిపారు. ఈ మేరకు తహసీల్దార్‌కు సమాచారం అందించామని చెప్పారు.

ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం రమేష్ కుమార్

గజపతినగరం: పురిటిపెంట గ్రామ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసుకున్న ఒకేషనల్ విద్యార్థులకు హెచ్‌ఎం చిప్పాడ రమేష్ కుమార్ పాఠశాలలో మంగళవారం ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పాఠశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసుకున్న నలుగురు ఒకేషనల్ విద్యార్థినులకు ఈ సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. ఒకేషనల్ విద్యార్థులకు ఉద్యోగవకాశాలు ఎక్కువగా ఉన్నా యని తెలిపారు. విద్యార్థులు ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరించిన కంప్యూటర్ ఉపాధ్యాయుడు కార్తీక్‌ను ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

విజయనగరం క్రైమ్: స్థానిక అలకానంద కాలనీలో నివాసం ఉంటున్న వివాహిత మంగళవారం ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని అనుమానాస్పద రీతిలో మృతిచెందింది. దీనికి సంబంధించి వన్ టౌన్ పోలీసులు మంగళవారం అందించిన వివరాలిలా ఉన్నాయి. గంట్యాడ మండలం మురపాక గ్రామానికి చెందిన పాటుపురెడ్డి వనిత (23) తన భర్త రాకోడు గ్రామానికి చెందిన రామారావుతో కలిసి అలకానంద కాలనీలో మూడు నెలలుగా నివాసం ఉంటోంది. భర్త సెంట్రింగ్ పనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి గదిలో అనుమానాస్పదరీతిలో సీలింగ్ ఫ్యాన్‌కి ఉరివేసుకుని మృతిచెందింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. వన్‌టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, విచారణ చేపట్టారు. మృతురాలి తండ్రి రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

వైభవం.. పైడితల్లి రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిక్కిరిసిన వెంపడాం
- అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు



వెంపడాంలో పైడితల్లి అమ్మవారి అంజలి రథోత్సవం



రథాలను అధిరోహిస్తున్న పూజారులు



పండగలో పోలీసుల బందోబస్తు



పూసపాటిరేగ: అసిరితల్లి అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న భక్తులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం గ్రామంలో మంగళవారం నిర్వహించిన పైడితల్లి అమ్మవారి అంజలి రథోత్సవానికి భక్తులు పోటెత్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమైన పాలధారోత్సవం 4 గంటలతో ముగిసింది. 4.10 నిమిషాలకు పైడితల్లి అమ్మవారి అంజలి రథోత్సం ప్రారంభమైంది. పూజారులు పిన్నింటి అప్పలనాయుడు, పిన్నింటి సత్యనారాయణ అంజలి రథాలను అధిరోహించారు. వెంపడాం గ్రామముఖద్వారం నుంచి గ్రామం శివారు వరకు మూడుసార్లు రెండు అంజలి రథాలు, నల్ల ఏనుగు, రెండు సాధారణ రథాలు తిరిగాయి. భక్తులు పూజారులపైకి అరటిపళ్లను విసిరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. వేదపండితులు పూరిగంటి వంశీయుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. రథోత్సవం సందర్భంగా గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. సుమారు ఆరు దశాబ్దాల తరువాత నిర్వహిస్తున్న పండగలు కావడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్టణం, అనకాపల్లి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గ్రామానికి వచ్చే దారులన్నీ భక్తులతో కిటకిటలాడుతూ కనిపించాయి. పూసపాటిరేగ, నెల్లిమర్ల ఎస్సైలు ఎ.సన్యాసినాయుడు, రామగణేష్‌లు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. స్థానిక ప్రజాప్రతినిధులు పిన్నింటి వెంకటరమణ, పిన్నింటి శ్రీనివాసరావు, సర్పంచ్ పిన్నింటి కుమార్, పిన్నింటి ఎల్లంనాయుడు, కొరటాన ప్రసాదరావు, పిన్నింటి రామునాయుడు ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా అసిరితల్లి పండగ

పూసపాటిరేగ:మండల కేంద్రమైన పూసపాటిరేగలో అసిరితల్లి అమ్మవారి పండగ మంగళవారం ఘనంగా జరిగింది. అమ్మవారి పూజారి పత్తి వంశీయులు ఘటాలను గ్రామంలోని అన్ని వీధుల్లో ఊరేగించారు. రాజావీధి, భూడివీధి, యాతపేట, ఎస్సీ కాలనీ, జాతీయ రహదారి మీదుగా అసిరితల్లి అమ్మవారి గుడి వరకు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం గుడిలో మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో సర్పంచ్ టొంపల సీతారాం, ప్రజాప్రతినిధులు మహంతి లక్ష్మణరావు, మహంతి జనార్దనరావు, మలుకుర్తి శ్రీనివాసురావు, తదితరులు పాల్గొన్నారు.